చెక్‌డ్యామ్‌లతోనే నీటి సంరక్షణ



చిట్టివలస - గుడివాడ వద్ద నీటిని నిల్వ చేసేందుకు అనువైన ప్రదేశం



నీటి సంరక్షణకు గతంలో ఏర్పాటు చేసిన పూనిగట్టు

- గోస్తనీ నదిపై నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు
- నేటికీ ఆ దిశగా చర్యలు శూన్యం
- ఆటుపోట్లతో ఉప్పగా మారుతున్న నది నీరు
- చిట్టివలస జ్యూట్‌మిల్లు పూనిగట్టునైనా పునరుద్ధరించాలంటున్న స్థానికులు

తగరపువలస: జీవీఎంసీతోపాటు విశాఖ, విజయనగరం జిల్లాల రూరల్ పరిధిలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, భోగాపురం, డెంకాడ మండలాలకు అవసరమైన తాగు, సాగునీటి అవసరాలకు ప్రధాన వనరు గోస్తనీ నది. ఒడిశా రాష్ట్రంలోని కొంత భాగం, విజయనగరం జిల్లాల నుంచి గోస్తనీ నది ద్వారా ప్రవహించే నీరు తగరపువలసకు 5 కిలోమీటర్ల సమీపంలోని గోస్తనీ సాగర సంగమ పరిధిలో ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలిసిపోతుంది. అంతేకాకుండా రోజూ రెండుసార్లు సంభవించే ఆటుపోట్ల కారణంగా తగరపువలస పాత వంతెన వరకు మంచినీరు ఉప్పునీటిగా మారిపోయి సాగు, తాగు అవసరాలకు పనికిరాకుండా పోతోంది. అయినప్పటికీ మత్స్యకారులు ఈ నీటిలో చేపలవేట సాగించేవారు. గత ప్రభుత్వ హయాంలో భీమిలి మున్సిపాల్టీలో మురుగు నీటిని చిట్టివలస, తగరపువలస వద్ద నదిలోకి మళ్లించడంతో ఉప్పు నీరు కాస్తా మురుగు నీటిగా మారిపోయింది. ఇప్పుడు ఇక్కడ చేపల వేట కూడా సాగడం లేదు. అలాగే నీటిని నిల్వ చేసుకోలేకపోవడం, ఉప్పునీరు, మురుగునీరు కారణంగా ఏడాది పొడవునా నదికి ఇరువైపులా ఉన్న స్థానిక సంస్థలపై ఆధారపడి ఉన్న ప్రజలకు తాగు, సాగు నీరు అందడం లేదు.

భవిష్యత్ కోసం చెక్‌డ్యామ్‌లు అవసరం

ప్రస్తుతం వర్షాకాలంలో కురిసిన వర్షం నీరు నేరుగా సముద్రంలో కలిసిపోకుండా భవిష్యత్తు అవసరాలకు నిల్వ చేసుకోవడం, భూమిపొరలలో ఇంకిపోయేలా చేయడానికి చెక్‌డ్యామ్‌ల అవసరం ఎంతైనా ఉంది. ఈ చెక్‌డ్యామ్‌ల నిర్మాణం కారణంగా సముద్రంలో ఆటోపోట్ల వల్ల కూడా ఉప్పునీరు గోస్తనీ నదిలోకి ఎగువకు రాకుండా బ్రేకులు వేయవచ్చు. దీనికోసం గత ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం 2010లో చిట్టివలస - గుడివాడ గ్రామాల మధ్య నదిలో రూ.2 కోట్లతో చెక్ డ్యామ్ నిర్మిస్తామని హామీ ఇచ్చి ఊరుకుంది. అంతకు ముందు టీడీపీ కూడా తాటితూరు, టి.నగరపాలెం, తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో దశలవారీగా చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తామని వాగ్దానాలు చేసి అమలు చేయలేకపోయింది. ప్రస్తుతం పద్మనాభం మండలం సామియ్యవలస, టి.నగరపాలెం, తగరపువలస వద్ద ఊటబావుల ద్వారా జీవీఎంసీ తాగునీరు సేకరిస్తుండగా మిగిలిన స్థానిక సంస్థలు బోర్ల ద్వారా నీటిని తరలిస్తున్నాయి. అయినప్పటికీ ఏదో ఒక సమయంలో తాగు, సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి.

జ్యూట్ యాజమాన్యం ముందు చూపు..

చిట్టివలస జ్యూట్‌మిల్లులో విద్యుత్ సదుపాయం లేనప్పుడు గోస్తనీ నదిలో రాళ్లతో వంతెన (పూనిగట్టు) నిర్మించి అక్కడి నీటిని ప్రస్తుతం పోలమ్మ ఆలయం వద్ద కృత్రిమ కోనేటికి మళ్లించి నిల్వ చేసేవారు. ఆ నీటితో ఆవిరి తయారు చేసి యంత్రాలు నడిపేవారు. ప్రస్తుతం భవిష్యత్ తాగు, సాగునీటి అవసరాల కోసం గుడివాడ - చిట్టివలస, టి.నగరపాలెం, తాటితూరు వద్ద నదిపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతోపాటు తగరపువలస పాత వంతెన వద్ద గట్టును ఎత్తు చేయడం ద్వారా గోస్తనీనదిలో నీటిని ఏడాది పొడవునా నిల్వ చేయవచ్చని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరుతున్నారు.



టి.నగరపాలెం వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనువైన ప్రదేశం

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తగరపువలస: భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టులకు 21 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగి, పదో తరగతి ఉత్తీర్ణులై స్థానికంగా నివసిస్తున్న వివాహితల నుంచి అధికారులు దరఖాస్తులు కోరుతున్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను భీమిలి ప్రాజెక్ట్ కార్యాలయానికి నేరుగా లేదా పోస్టు ద్వారా అందించాలని సూచించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీల వివరాలు

పాత మూలకుద్దు (ఎస్సీ), శొంఠ్యాం - 1 (ఎస్సీ)

అంగన్‌వాడీ హెల్పర్లు (ఆయా) ఖాళీల వివరాలు

కురపల్లి (బీసీ - డి), గెద్దపేట (ఎస్టీ), పాతపాలెం (ఎస్సీ), విజయరాంపురం (ఎస్సీ), కంచేరుపాలెం (ఎస్సీ), దిబ్బమీదపాలెం (ఎస్సీ), వెల్లంకి (ఓహెచ్), జీవీఎంసీ ఒకటో వార్డు వెంపాడ వారి వీధి (ఎస్టీ), రెండో వార్డులో కుమ్మరివీధి (బీసీ - బి), వలందపేట (ఎస్సీ), నాలుగో వార్డులో పుక్కళ్ల పాలెం (ఓహెచ్). దివ్యాంగ అభ్యర్థులు (ఓహెచ్) లేనిచోట ఇతర అభ్యర్థులతో ఖాళీలు భర్తీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

రీ సర్వేలో పూర్తి వివరాలు పొందుపరచాలి

ఆనందపురం : రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీ సర్వేలో పూర్తి వివరాలు పొందుపరచాలని జేసీ విశ్వనాథన్ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. మండలంలోని పందలపాకలో జరుగుతున్న రీ సర్వేను మంగళవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పందలపాక సర్వే నంబర్లు 23/8, 9లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే బృందం రూపొందిస్తున్న నివేదికను పరిశీలించారు. భూ హక్కుదారులను నిర్ధారించేటప్పుడు అన్ని రకాల హక్కులు, వారసత్వ వివరాలు పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలోనే అన్ని విషయాలు రాబట్టాలని సూచించారు. వివాదాలు ఉంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం పేకేరులో సీఆర్‌పీఎఫ్‌కు కేటాయించనున్న భూములను పరిశీలించారు. ఆయనవెంట ఆర్డీవో భాస్కరరెడ్డి, తహసీల్దార్ లోకవరపు రామారావు తదితరులు ఉన్నారు.



పందలపాకలో రీసర్వే రికార్డులు పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్, అధికారులు

మైదానాల్లో వసతుల కల్పనకు చర్యలు



తగరపువలస ఫ్లై ఓవర్ కింద ప్రకటనలపై ఆరా తీస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



వుడా మైదానాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జెడ్సీ రాము

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

భీమునిపట్నం: భీమిలిలోని వుడా మైదానం, ఇండోర్ స్టేడియంలో అవసరమైన వసతులను త్వరలో కల్పిస్తామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. మంగళవారం ఆయన వాటిని పరిశీలించారు. ఇక్కడి వుడా మైదానంలో అవసరమైన వాకింగ్ ట్రాక్, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు ఇతర వసతులు కల్పిస్తామని తెలిపారు. దీంతోపాటు ఇండోర్ స్టేడియంలో ప్రస్తుతం ఉన్న సిమెంట్ ఫ్లోరింగ్ వల్ల ఇబ్బందిగా ఉండగా వుడెన్ ఫ్లోరింగ్ కావాలని పలువురు కోరగా ఏర్పాటుకు హామీ ఇచ్చారు. స్టేడియంలో లైట్ల ఏర్పాటు, ఇతర పనులు చేపడతామని తెలిపారు. వీటికి అవసరమైన అంచనాలు రూపొందించి పంపాలని జోనల్ అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డును పరిశీలించి సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. ఆయనతోపాటు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, పారిశుధ్య అధికారి మహాలక్ష్మినాయుడు ఉన్నారు.

గోడలపై వ్యాపార ప్రకటనలు కనిపిస్తే జరిమానా

తగరపువలస: భీమిలి జోన్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ గోడలపై పలు వ్యాపార ప్రకటనలు కనిపించడంపై టౌన్ ప్లానింగ్ అధికారులపై జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తగరపువలసలో మంగళవారం పర్యటించిన ఆయన జీడిపప్పుల దుకాణాలకు సమీపంలో ఫ్లై ఓవర్ కింద ప్రైవేట్ ప్రకటనలు అంటించి ఉండటంపై ఆరా తీశారు. వెంటనే వాటిని తొలగించి ప్రకటనకర్తల నుంచి అపరాధ రుసుము వసూలు చేయాలని ఆదేశించారు.

దివీస్ పార్కును ఆనుకుని ప్రధాన కాలువలలో పూడిక తొలగించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలోనూ సర్వీస్ రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. నమ్మివానిపేట డంపింగ్ యార్డు నుంచి ఎప్పటికప్పుడు చెత్తను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. భీమిలి జోన్‌లో ప్రధాన రహదారులు సరిగా శుభ్రం చేయడం లేదని, వీటిపై దృష్టి సారించాలని జెడ్సీ బి.రామును ఆదేశించారు. ప్రతి బుధవారం నిర్వహించే యూజర్ చార్జీల డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని శానిటరీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయనవెంట అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆశ కార్యకర్తలకు శిక్షణ

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సందర్భంగా ప్రధాన వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు ఆశా కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సాధారణ ప్రసవాలు చేసేందుకు ప్రతి ఒక్కరూ ప్రణాళికతో పనిచేయాలన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్, డ్రై డే - ఫ్రైడే, హెచ్‌పీఎస్‌సీ / హెచ్‌బీవైసీ కార్యక్రమాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మరో వైద్యుడు సందీప్, ఏఎన్‌ఎంలు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి స్మార్ట్ నానో టెక్నాలజీపై సదస్సు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం, ఖతార్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా జూలై 6 నుంచి 8వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సును విశాఖలోని గీతం ప్రాంగణంలో నిర్వహించనున్నామని స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.కృష్ణ తెలిపారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి 50 మందికిపైగా శాస్త్రవేత్తలు ఈ అంతర్జాతీయ సదస్సుకు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఈ సదస్సులో బయో మెటీరియల్స్, సోలార్ సెల్స్, సెమీ కండక్టర్ టెక్నాలజీ, హైడ్రోజన్ ప్రొడక్షన్, స్మార్ట్ నానో సెన్సార్ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. సదస్సులో పాల్గొనదలచిన వారు జూన్ 15లోగా సదస్సు పేరిట ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పరిశోధనలకు రూ.10 లక్షల ప్రోత్సాహం



రమాదేవికి చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో ఉన్న విశ్వనాథ ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ రమాదేవికి పరిశోధన కోసం ఎస్ఎస్ఐఐ టెక్నాలజీ బిజినెస్ సెంటర్ యాజమాన్యం ఇటీవల రూ.10 లక్షలు ప్రోత్సాహకంగా అందజేసింది. ఇక్కడ అసిస్టెంట్ ప్రొఫెసర్ బంకపల్లి రమాదేవి ఇటీవల ఈకో ఫ్రెండ్లీ హెర్బల్ శానిటరీ నాప్‌కిన్‌ను తయారు చేసి అందరి మన్ననలు అందుకున్నారు. ఈ మేరకు ఆమె ప్రజ్ఞను గుర్తించిన ఎస్ఎస్ఐఐ టెక్నాలజీ బిజినెస్ సెంటర్ అనే స్టార్టప్ కంపెనీ సీఈవో సూర్యకుమార్ హెర్బల్ శానిటరీ నాప్‌కిన్ పరిశోధనకు తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిధులు అందజేశారు. ఈ రంగంలో మరింత పరిశోధన చేసి కొత్త వాటిని ఆవిష్కరించడానికి సాంకేతిక నైపుణ్యాన్ని అందిస్తామని రమాదేవికి హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఇతర అధ్యాపక సిబ్బంది రమాదేవిని అభినందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పడిపోవడానికి సిద్ధంగా ఉన్న స్తంభం

భీమునిపట్నం: విద్యుత్ స్తంభం విరిగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉండడంతో పెద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడి కృష్ణా కాలనీలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో వీధి లైట్ ఉన్న స్తంభం విరిగిపోయింది. ఈ మార్గంలో పలువురు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ పరిస్థితుల్లో స్తంభం ఏ క్షణంలోనైనా పడిపోతే అక్కడ ఉండే వారి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉంది. తక్షణమే అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మరోచోట పగిలిన పైప్‌లైన్

తగరపువలస: స్థానిక కొండపేట గోస్తనీ నది పంప్‌హౌస్ నుంచి భీమిలి పట్టణానికి తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ సోమవారం రాత్రి విల్సన్‌పేట ప్రాథమిక పాఠశాల ముందు పగిలిపోయింది. పైప్‌లైన్ మరమ్మతుల కోసం గతంలో తవ్వి పూడ్చిన గుంతపై నుంచి క్వారీ లారీ వెళ్లిపోవడంతో పగిలిపోయి ఆ ప్రాంతంలో రోడ్డుపై చేరిన నీటితో చెరువులా మారింది. మంగళవారం ఉదయం నుంచి తాగునీటి సరఫరా విభాగానికి చెందిన ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులకు ఉపక్రమించినా పైప్‌లైన్‌లో నీరు, విద్యుత్ సరఫరా లేని కారణంగా ఆటంకంగా మారింది. దీంతో మధ్యాహ్నానికి మోటారుతో నీటిని తోడివేశారు. ఏ సమయానికైనా పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి చేసి భీమిలి పట్టణానికి తాగునీటి సరఫరాకు సంబంధించి ఇబ్బంది లేకుండా పూర్తి చేస్తామన్నారు. ఇదిలా ఉండగా గణేష్ థియేటర్ కూడలిలో ఏర్పడిన గుంత నుంచి మంగళవారం తాగునీరు వృథాగా పోయింది.



విల్సన్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ముందు పగిలిన పైప్‌లైన్

రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

పద్మనాభం: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు ఉంచామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం మంగళవారం తెలిపారు. పొట్నూరు, తునివలస, నేరేళ్లవలస, కోరాడ, అనంతవరం, కొవ్వాడ, రేవిడి, పాండ్రంగి రైతు భరోసా కేంద్రాల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 31.12 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు కేంద్రాల్లో ఉన్నాయన్నారు. జీలుగ పది కిలోల ప్యాకెట్ రూ.790 కాగా సబ్సిడీపై రూ.395కు, జనుమ పది కిలోల ప్యాకెట్ రూ.840 కాగా సబ్సిడీపై రూ.420కు, పిల్లి పెసర ఎనిమిది కిలోల ప్యాకెట్ రూ.776 కాగా సబ్సిడీపై రూ.388కు ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. మిగతా రైతు భరోసా కేంద్రాలకు నాలుగు రోజుల్లో పచ్చిరొట్ట విత్తనాలు వస్తాయని ఆయన తెలిపారు.

అమిత్‌షా సభకు తరలిరావాలి

తగరపువలస: కేంద్ర మంత్రి అమిత్‌షా ఈ నెల 11న జిల్లా పర్యటన సందర్భంగా భీమిలి బీజేపీ నాయకులు తగరపువలసలో మంగళవారం సాయంత్రం సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ తగరపువలస మండల అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ 9 ఏళ్ల సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 30 రోజులపాటు కార్యక్రమాల నిర్వహణలో భాగంగా అమిత్‌షా వస్తున్నారన్నారు. బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పీవీవీ ప్రసాదరావు, పంపాన శ్రీధర్, కురుమెళ్ల కవిత, వెంకటరెడ్డి, విజయ, నర్సూబాయి, ప్రసన్న, ధరణి, పంపాన సుబ్రహ్మణ్యం, నీలిమ, వేంకటేశ్వరరావు, రాంబాబు, మంగవేణి తదితరులు పాల్గొన్నారు.



తగరపువలసలో సమావేశమైన బీజేపీ భీమిలి నాయకులు

ఘనంగా అమ్మవార్ల అనుపోత్సవాలు



సంగివలసలో రథోత్సవంలో భక్తులు





కాంతార నృత్య ప్రదర్శనలో కళాకారులు, అగ్నితో కాంతార కళాకారుని విన్యాసం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంగివలస, నమ్మివానిపేట, ఇడదాసరిపేట, ఊళ్లపేట, నమ్మివానిపేట కాలనీ, సంగివలస కాలనీ తదితర గ్రామాల దేవత దుర్గాలమ్మ, రాయప్పాలెం, భీమిలి మండలం రేఖవానిపాలెం గ్రామ పంచాయతీల దేవతలు మరిడమ్మ, నూకాలమ్మ, అన్నవరం పంచాయతీ గ్రామదేవతలు భూలోకమ్మ, పోలమాంబ, సత్తెమ్మతల్లి అనుపోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల దేవతల ఉత్సవాల్లో భాగంగా బంధువులు, స్నేహితులతో విందు, వినోదాలతో గ్రామాల్లో సందడి నెలకొంది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ కార్యకర్తలు, నాయకుల ఇళ్లకు విచ్చేశారు. సాయంత్రం గ్రామాల్లో రథోత్సవం నిర్వహించగా భక్తులు వాటిపై పండ్లు, పసుపు, కుంకుమ, చీరలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. బాణసంచా మోతలు, నేలవేషాలు, పులివేషాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు కళాకారులు సంగివలసలో ప్రదర్శించిన కాంతార నృత్యం అందరినీ ఆకట్టుకుంది. వేడుకల్లో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ దంతులూరి వాసురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు తదితరులు సహాయ సహకారాలు అందించారు.

పాలిథిన్ నిషేధంతోనే మనుగడ సాధ్యం

తగరపువలస: భీమిలి మండలం దివీస్ లేబొరేటరీ ఉద్యోగులు మంగళవారం అన్నవరం పంచాయతీలోని వివిధ గ్రామాల్లో 270 కిలోల పాలిథిన్ వ్యర్థాలను సేకరించారు. ఈ సందర్భంగా ప్రజలకు, దుకాణదారులకు పాలిథిన్‌తో కలిగే నష్టాలపై అవగాహన కలిగించారు. ప్రత్యామ్నాయంగా కాగితపు, గుడ్డ సంచులు వినియోగించాలని సూచించారు. ఈసీడీ విభాగపు డీజీఎం ఎస్.బాలాజీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు దివీస్ యాజమాన్యం పాటుపడుతుందన్నారు. మేనేజర్ ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రజలు పాలిథిన్‌ను పూర్తిగా వదిలించుకుంటేనే జీవకోటి మనుగడ సాధ్యమవుతుందన్నారు. జీఎం వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ సేకరించిన పాలిథిన్ వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం జీవీఎంసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ యార్డుకు తరలించామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, పి.శేఖర్‌బాబు, వెంకటరెడ్డి, లక్ష్మణరావు, డి.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.



భీమిలి మండలం అన్నవరంలో సేకరించిన పాలిథిన్ వ్యర్థాలతో దివీస్ ఉద్యోగులు

వైభవంగా బబ్బేలమ్మ పండగ

పీఎం పాలెం: పీఎం పాలెం వాసుల ఆరాధ్య దేవత బబ్బేలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం పాత పీఎంపాలెం, లక్ష్మివానిపాలెం, పిలకవానిపాలెం ప్రాంతాలు డప్పుల మోతతో దద్దరిల్లిపోయాయి. సాముగరిడీలు, పులివేషాలు, తప్పిటగుళ్లు, పార్వతీ పరమేశ్వరుల ప్రమదఘుణం, కాళీ మాత నృత్యం ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. గ్రామంలోని అన్ని రోడ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోయాయి. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.



ప్రత్యేక అలంకరణలో బబ్బేలమ్మ అమ్మవారు



ఆకట్టుకున్న పార్వతి, పరమేశ్వరుల వేషధారుల నృత్యం

సంక్షేమం... అభివృద్ధి రెండు కళ్లు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అడవివరంలోని 527 సచివాలయం పరిధిలో కాపువీధి, సింహగిరి ఘాట్‌రోడ్డు, కుమ్మరిదిబ్బ ఏరియాల్లో మంగళవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎవరెవరికి ఎంతెంత లబ్ధి చేకూరిందో గణాంకాలతో తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 95 శాతానికి పైగా హామీలు సీఎం జగన్ నెరవేర్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాపువీధిలో వీధి దీపాలు వెలగడం లేదని, రోడ్లు లేవని నిర్వాసితులు ముత్తంశెట్టి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన జీవీఎంసీ ఎలక్ట్రికల్ ఏఈని పిలిచి లైట్లు వేయాలని సూచించారు. ప్రధానంగా సింహాచలం దేవస్థానంతో తమ గ్రామం ముడిపడి ఉండటంతో శిథిలమైన ఇళ్లకు కూడా మరమ్మతులు చేసుకోలేని దుస్థితి ఉందని నిర్వాసితులు ఎమ్మెల్యేకు వివరించారు. నెలరోజుల్లో బాధితులకు శుభవార్త అందుతుందని హామీ ఇచ్చారు. సింహాచలం దేవస్థానం భూ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్సీ మల్లయ్య నాయుడు, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు పాల్గొన్నారు.



వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

135 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు



కొత్త మూలకుద్దులో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం కొత్త మూలకుద్దులో మంగళవారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 135 మందికి పరీక్షలు చేశారు. విశాఖ ఐ ఆస్పత్రి ట్రస్ట్ సహకారంతో పరీక్షలు నిర్వహించి 10 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొల్లి కోటిరెడ్డి, సమితి కన్వీనర్ జి.సత్యనారాయణ, జోనల్ కో ఆర్డినేటర్ మానాపురం సాయి, ఆస్పత్రి కో ఆర్డినేటర్ ఇ.సాయికృష్ణ, సీహెచ్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.